పరిష్కారం.. సాధ్యమయ్యేనా..?

- 10,205 దరఖాస్తులకు.. తొమ్మిది రోజుల్లో పరిష్కారం
- కసరత్తు మొదలుపెట్టిన తాసీల్దార్‌లు

మేడ్చల్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని 15 మండలాలకు సంబంధించి ధరణి పోర్టల్‌లో 10,205 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటి పరిశీలనకు 21 అధికార బృందాలను నియమించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తాసీల్దార్ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోనున్నారు. అవసరమైతే ఫీల్డ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అయితే తొమ్మిది రోజుల్లోనే 10,205 దరఖాస్తులను పరిష్కరించి, అందుకు సంబంధించిన నివేదికను అందజేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో తొమ్మిది రోజుల్లో 10,205 దరఖాస్తులకు పరిష్కారం చూపడం సాధమయ్యేనా.? అని అధికారులు ఆలోచనలో పడ్డారు.

నేడు ఎంజీబీఎస్‌లో దసరా లక్కీ డ్రా

సుల్తాన్‌బజార్, మార్చి 3 : గత యేడాది అక్టోబర్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన లక్కీ డీప్ విజేతల లక్కీ డ్రాను ఈ నెల 4న ఎంజీబీఎస్‌లో తీయనున్నట్లు రంగారెడ్డి రీజనల్ మేనేజర్ బి.రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ప్రయాణికుల సమక్షంలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నేడు శంకుస్థాపన

సిటీబ్యూరో, మార్చి 3(నమస్తే తెలంగాణ): హబ్సిగూడలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ ఎక్స్‌పెరిమెంటల్ సెంటర్‌కు కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, కిషన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

బైరమాల్ గూడ రెడ్డి కాలనీ వద్ద నిలిచిపోయిన నాలా పనులు

పనులు నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారిన నాలా

ముంపు తప్పదా..?

ఎస్ఎన్‌డీపీపై.. ఎందుకీ నిర్లక్ష్యం. ?

ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతిపై సమీక్షించని కాంగ్రెస్ ప్రభుత్వం

- ఖజానాలో డబ్బుల్లేక కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిలిపివేత
- రూ.394.65 కోట్లతో 20 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం
- మూడు నెలలుగా నిలిచిన 'నాలాల అభివృద్ధి' పనులు
- వర్షాకాలం నాటికల్లా.. పూర్తికాకుంటే తప్పని వరద ముంపు
- భయాందోళనలో శివారు ప్రాంతాల ప్రజలు

బైరమాల్‌గూడలో మధ్యలోనే నిలిచిపోయిన నాలా నిర్మాణ పనులు

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో నాలా అభివృద్ధి పనులు మూడు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. హుస్సేన్‌సాగర్ వరద నీటి నాలా, బుల్కాపూర్ నాలా పనులతో పాటు శివారు మున్సిపాలిటీల్లో చేపట్టిన (వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం) పనులు మధ్యనే నిలిచిపోయాయి. చేసిన పనులకు జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించడం లేదని, పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేపడతామంటూ కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసినట్లు తెలుస్తున్నది. మొన్నటి వరకు మందకొడిగా సాగిన పనులు.. ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోవడంలో ఆందోళన నెలకొన్నది. మరో మూడున్నర నెలల్లో వర్షాకాలం మొదలు కానున్నది. అప్పటి వరకు పనులు పూర్తికాకుంటే.. వరద ముంచెత్తే ప్రమాదం ఉంటుందని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

రూ. 985.45కోట్లతో..

2020 అక్టోబర్‌లో భారీ వర్షాలతో నగరాన్ని వరద ముంచెత్తింది. దీంతో ముంపు సమస్యకు శాశ్వత చర్యలు చేపట్టాలని భావించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఎస్ఎన్‌డీపీ తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.531కోట్లతో 35 ప్రాంతాల్లో వేలాది కాలనీలకు వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతిపై సమీక్షించిన దాఖలాలు లేవు. ఖజానాలో డబ్బుల్లేక కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా ప్రాంతాల్లో గోడలు, స్లాబుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫలితంగా రూ.394.65 కోట్లతో 20 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా వచ్చే వర్షాకాలం నాటికల్లా ఈ పెండింగ్ పనులు పూర్తి కాకపోతే సరూర్‌నగర్, నాగోల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. కాగా, జీహెచ్ఎంసీ పరిధిలో రూ.747.45కోట్లతో 37 చోట్ల పనులకు ఎస్బీఐ ద్వారా రూ. 515.96కోట్ల రుణం తీసుకోగా... మిగిలిన రూ. 231.81 కోట్ల నిధులను జీహెచ్ఎంసీ సమకూర్చాల్సి ఉంది. జీహెచ్ఎంసీ అవతల రూ. 238 కోట్లతో 21 చోట్ల జరిగే పనులకు శివారు మున్సిపాలిటీలు నిధుల భారం భరించాల్సి ఉంటుంది. మొత్తంగా నిధుల అడ్డంకితో నాలా అభివృద్ధి పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది.

ఎస్ఎన్‌డీపీ పనుల వివరాలు

జోన్	వర్క్స్/ రూ. కోట్లలో	పూర్తయినవి/ పెట్టిన ఖర్చు	పురోగతిలో ఉన్నవి/ వెచ్చించాల్సిన నిధులు
సికింద్రాబాద్	8/ 261.08	6/161.15	2/99.92
కూకట్‌పల్లి	3/112.80	2/79.36	1/33.43
ఎల్బీనగర్	10/122.33	7/73.54	3/34.79
చార్మినార్	7/93.24	6/45.24	1/48.00
ఖైరతాబాద్	7/137.12	4/52.33	2/62.85
శేరిలింగంపల్లి	2/20.88	2/20.88	———
జీహెచ్ఎంసీ ఏరియా	37/747.45	27/432.50	9/278.99
జీహెచ్ఎంసీ అవతల	21/ 238.00	8/98.49	11/115.66

పూడికతీతకు 9.50 కోట్లతో యంత్రాలు

చెరువుల పరిరక్షణకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. హుస్సేన్‌సాగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు ప్రత్యేకంగా రూ.9.50 కోట్లతో వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచారు. ఈనెల 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో టెండర్లు సమర్పించాలని అధికారులు సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

మూసాపేట పాటిదార్ భవనంలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 3 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. ఆదివారం మూసాపేట పాటిదార్ భవనంలో బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. మహిళలు చదువుకొని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దివంగత ప్రధాని పీవీ.నర్సింహారావు సేవలను గుర్తిస్తూ దేశ అత్యున్నతమైన భారతరత్న ఇవ్వడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ప్రధానిగా పీవీ నర్సింహారావు దేశ ఆర్థిక విధానాలతో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం శిరీష నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సమైఖ్య సభ్యులు విజయలక్ష్మి, హేమలత, దేవిక, శశికళ, సుధారాణి, శ్రీదేవి, కావేరి, సరోజ, రత్నకుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కె.వేణుగోపాల్

చిక్కడపల్లి, మార్చి 3 : కేంద్ర ప్రభుత్వ రంగంలో ఉన్న నాలుగు బీమా సంస్థలను విలీనం చేసి ఒకే సంస్థగా ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ సిల్వర్‌జూబ్లీ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వేణుగోపాల్ మాట్లాడుతూ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఇండియన్ ఇన్సూరెన్స్, ఓరియెంటల్ ఇన్సూరెన్స్, యూనైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్నాయని, వీటిని ఒకే గొడుకు కిందకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె.గురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ పెన్షనర్లకు సంబంధించిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.బుచ్చిరెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి వీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

హిమాయత్‌నగర్‌లోని సెయింట్ పాల్స్ డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరైన విద్యార్థులు

హిమాయత్‌నగర్, మార్చి 3 : హిమాయత్‌నగర్‌లోని సెయింట్‌పాల్స్ డిగ్రీ, పీజీ కాలేజీ ఆవరణలో ఆదివారం జరిగిన జాబ్ మేళాకు సుమారు రెండువేల మంది విద్యార్థులు హాజరుకాగా 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ డిగ్రీ, పీజీ కాలేజీ కార్యదర్శి సిరాజుద్దీన్, కాలేజీ ప్రిన్సిపల్ హయగ్రీవ చారి, వైస్ ప్రిన్సిపల్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి 'అవేకనింగ్ ది యూత్ విత్ విన్' కాన్ఫరెన్స్.
- రవీంద్రభారతి మినీ హాల్‌లో సాయంత్రం 6 గంటలకు విజ్ఞాన సరోవర ప్రచురణలు, 'మలగని బత్తి' నవ లాత్రయం ఆవిష్కరణ.
- నగరంలో ఈరోజు మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమాలు. బల్కంపేట, న్యూ బోయిగూడలో అంగన్‌వాడీ సెంటర్లు ప్రారంభం, ధరంకరం రోడ్‌లోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో, ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం, నారాయణగూడలో బస్తీ దవాఖానను ప్రారంభించనున్నారు.

గమనిక: నగరంలో జరిగే కార్యక్రమాల వివరాలను ntgcitybureau@gmail.com కు పంపగలరు.

ఆ భూములను కాపాడే బాధ్యత మీదే.!

హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 8347 ఎకరాల భూమి ❖ కబ్జా కాకుండా రక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు

- అన్యాక్రాంతమవుతున్న భూముల పరిరక్షణకు చర్యలు షురూ
- ట్రక్ పార్క్ స్థలం సంరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయింపు

hmda Growing Global

సిటీబ్యూరో, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : అన్యాక్రాంతమవుతున్న భూముల పరిరక్షణకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న భూములు అత్యంత విలువైనవి కావడంతో వాటిని కాపాడాల్సిన అవసరం ఉన్నదని ఉన్నతాధికారులకు ఇటీవల హెచ్ఎండీఏపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులు మొత్తం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న భూముల లెక్కలను ప్రాథమికంగా గుర్తించారు. సుమారు 8347 ఎకరాలను హెచ్ఎండీఏకు ప్రభుత్వం వివిధ సమయాల్లో కేటాయించినట్లు రికార్డులను గుర్తించి, ఒక నివేదికను రూపొందించారు. ఇవన్నీ ఔటర్ రింగు రోడ్డు లోపల, ఆచుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఉండడంతో వాటి మొత్తం విలువ వేల కోట్లుగా ఉన్నాయి. అలాంటి విలువైన భూములు కబ్జా కాకుండా చూసేందుకు హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగం అధికారులు ప్రత్యేకంగా ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలు చేపట్టనున్నారు.

శంషాబాద్ ట్రక్ పార్కు స్థలానికి రక్షణ చర్యలు

సరుకు రవాణా పరంగా శంషాబాద్ ఎంతో అనుకూలమైన ప్రాంతమని గుర్తించి అక్కడ 100 ఎకరాలను ట్రక్ పార్కింగ్ టర్మినల్ నిర్మాణం కోసం కేటాయించారు. ఔటర్ రింగు రోడ్డు లోపల హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి ఒకవైపు, మరోవైపు ఓఆర్ఆర్ ఉండడంతో ఈ స్థలం పూర్తి స్థాయిలో లాజిస్టిక్ కార్యకలాపాలకు అనుకూలంగా ఉంది. ఈ స్థలంపై కొందరు ప్రైవేటు వ్యక్తులు కోర్టుకు వెళ్లినా, న్యాయస్థానంలో ప్రభుత్వం బలంగా వాదనలు వినిపించింది. దీంతో హెచ్ఎండీఏ ఆధీనంలోకి వచ్చిన ఈ స్థలాన్ని పూర్తి స్థాయిలో పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి నుంచి శంషాబాద్ సింప్లెక్స్ రోడ్డులో ఉన్న స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద మొత్తంలో మొక్కలను నాటి పరిరక్షించాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.47.74లక్షల నిధులను వెచ్చించేందుకు హెచ్ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారు. పనులు వెంటనే పూర్తి చేసేందుకు టెండర్లు సైతం పిలిచింది.

సమాజాన్ని సంస్కరించేలా కవిత్వ రచన కొనసాగాలి

యువ కవయిత్రుల కవిత్వ అధ్యయన శిబిరంలో పాల్గొన్న వక్తలు.

ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 3 : తనను తాను సంస్కరించుకుని ఇతరులను సంస్కరించడానికి రాసేదే కవిత్వమని ప్రముఖ కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన యువ కవయుత్రుల అధ్యయన శిబిరంలో నారాయణ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఇతివృత్తం నుంచి శీర్షిక వరకు అపూర్వంగా కవిత్వం ఉండాలని యువ కవయిత్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రముఖ కవి శ్రీనివాసాచార్య, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ శిబిరానికి 80మంది పాల్గొనడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి డాక్టర్ దాసోజు పద్మావతి, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆకులపై కళా కృతులు

అమీర్‌పేట్, మార్చి 3 : సనత్‌నగర్ జేకే కాలనీకి చెందిన వాణి రెడ్డి చక్కటి కళాకృతులను సునాయసంగా తీర్చిదిద్దుతున్నారు. ఐటీలో అత్యున్నతమైన బాధ్యతను కాదనుకుని ప్రశాంత జీవనం సాగిస్తున్న వాణిరెడ్డి దాదాపు 4 సంవత్సరాల క్రితం లీఫ్ కార్వింగ్‌ను సరదాగా ప్రారంభించి చక్కటి కళా కృతులను ఆవిష్కరించే స్థాయికి చేరారు. సూర్య నమస్కారాలలోని 12 పద్ధతులను, శివుడు తప్పస్సు చేస్తున్నటువంటి అనేక చిత్రలను రావి, బాదం ఆకులపై చక్కగా తీర్చిదిద్దారు. వీటిని సందర్భాన్ని బట్టి తెలిసిన వారికి గిఫ్ట్‌లుగా అందిస్తున్నాను.

అర్థం చేసుకుందాం..

అండగా నిలుద్దాం..!

మహిళల ఆరోగ్యాన్ని కుదిపేస్తున్న ఎండో మెట్రియోసిస్

- దేశంలో 42 మిలియన్ల బాధితులు
- అవగాహన కోసం దేశంలోనే మొదటిసారిగా యెల్లో రిబ్బన్ రన్

సిటీబ్యూరో/ఖైరతాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మానసికంగా, శారీరకంగా మహిళల జీవితాలను కబలిస్తున్న ఎండో మెట్రియోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరాన్ని చాటుతూ.. ఎండో మెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు 'యెల్లో రిబ్బన్ రన్' నిర్వహించారు. ఇది దేశంలోనే మొదటి రన్ కావడం విశేషం. ఎండో మెట్రియోసిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెక్లెస్ రోడ్డులో ఆదివారం ఉదయం 6 గంటలకు జరిగిన 5కే, 3కే రన్‌లో ఔత్సాహికులు పాల్గొని తమ బాధ్యతను చాటారు. మహిళలను మానసికంగా, శారీరకంగా ఇబ్బందిపెట్టే ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విమీ బింద్ర తెలిపారు. ప్రతి పది మందిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు చెప్పారు. దేశంలో 42 మిలియన్ల మంది ఎండో మెట్రియోసిస్ బారిన పడ్డారని వివరించారు. ప్రపంచంలో 247 మిలియన్ల మంది ఈ వ్యాధితో ఉన్నట్టు తెలిపారు. ఈ వ్యాధి నివారణకు కనీసం 8 ఏండ్లు పడుతుందని చెప్పారు. ఇప్పటికే 35శాతం మంది మహిళలు తమ ఉద్యోగ అవకాశాలను వదులుకున్నారని చెప్పారు. అంతేకాకుండా భార్యభర్తల మధ్య బంధాలు సైతం కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం సహకారంతో ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక పాలసీని రూపొందించేల ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. అర్థం చేసుకొని మహిళలకు అండగా ఉండాలని వివరించారు. కాగా, ఈ రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీవీబీ రామయ్య, సంధ్యారాణి, ఎన్ఎండీసీ టెక్నికల్ డైరెక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ శ్వేత, డాక్టర్ అర్చన, అపోలో సీఈఓ తేజస్వి రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సదస్సు..!

ఎండో మెట్రియోసిస్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఎండో మెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోటల్ మ్యారీగోల్డ్‌లో సదస్సు జరిగింది. ఆదివారం సదస్సు ముగిసినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విమి బింద్ర తెలిపారు. సదస్సులో భాగంగా ఎండో మెట్రియోసిస్ వ్యాధి లక్షణాలు, చికిత్స పద్ధతులపై వైద్య నిపుణులు చర్చించారు. లైవ్ సర్జరీల వీడియో ప్రజెంటేషన్స్ ఏర్పాటు చేశారు. చికిత్స పరికరాలను ప్రదర్శనకు ఉంచారు.

దద్దరిల్లిన ధర్నాచౌక్

మెస్ చార్జీలు పెంచాలని రోడ్డెక్కిన విద్యార్థులు

మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మార్చి 3 : పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని 8లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకుల పాఠశాల, కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16లక్షల కాలేజీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగుల వేతనాలు పెంచినప్పుడు.., పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు బకాయిలు దాదాపు రూ.3500 కోట్లు వెంటనే చెల్లించాలని, డే స్కాలర్‌కు సంవత్సరానికి రూ.20 వేల స్కాలర్ షిప్‌ను ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని, బీసీలకు జనాభా ప్రకారం అదనంగా మరో 240 బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 300 కాలేజీ హాస్టళ్లను కొత్తగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ముదిరాజ్, నందగోపాల్, రాజ్ కుమార్, నర్సింగ్ రావు, సి.రాజేందర్, మోడీ రామ్‌దేవ్, నిఖిల్, ఉదయ్ నేత, అంజి, సత్యం, పి.సుధాకర్, అనంతయ్య, కృష్ణయాదవ్, నర్సింహ గౌడ్, మాణిక్ రావు, కరుణశ్రీ, కోటేశ్వరి, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.